# అడవి

అడవిలో కాసేపు సరదాగా గడిపిరావాలనుకునేవారికి ఆ మేరకి సరదా తీర్చగల 'అడవి' చిత్రం ఆగస్టు 7న విడుదలైంది. ఈ చిత్రంలో వివిధ అంశాల్ని పరిశీలిస్తే:

**పేరు:** హిందీలో అగ్యాత్ (అజ్ఞాతం), తెలుగులో అడవి- పేర్లతో విడుదలైన ద్విభాషా చిత్రమిది. ఆ పేర్లకి మించి కథ లేదు కాబట్టి చిత్రానికి తగిన పేర్లే ఎంచుకున్నారనుకోవచ్చు.

**కథ:** షూటింగ్ కోసం ఓ సినిమా బృందం అడవికి వెడుతుంది. అడవి ఆనుపానులు తెలిసిన సేతుని ఓ అజ్ఞాతజీవి క్రూరంగా చంపేయడంతో బృందంలో కలకలం బయల్దేరుతుంది. అక్కణ్ణించి వరుసగా ఒకొక్కరే మరణిస్తూంటారు. కొందరికి అజ్ఞాతజీవి వల్ల, కొందరికి తెలిసినవారి చేతిలో- చావులు. కొందరిది ఆత్మహత్య. చివరికి హీరో హీరోయిన్లు మాత్రం బ్రతికి బట్ట కడతారు. ఇలా చెబితే కొంత ఆసక్తికరంగా అనిపించొచ్చేమో కానీ- చిత్రీకరణలో ఇంతకుమించి కథలేక- పేలవంగా అనిపిస్తుంది.

**కథనం:** ఓ 'బీస్ సాల్ బాద్', ఓ 'గుమ్నామ్' కేవలం కథనంవల్లనే చెప్పలేనంత ఆసక్తి పుట్టిస్తాయి. ఈ చిత్రంలో పాత్రలు భయపడ్డానికే తప్ప, ప్రేక్షకుల్లో ఆసక్తి పుట్టించే కథనం లేదు.

**దర్శకత్వం:** ఈ చిత్రంలో దర్శకుడు రామగోపాలవర్మ ప్రేక్షకుల్ని పాత్రలతోపాటు అడవిలోకి తీసుకుపోతారు. ఆ తర్వాత పాత్రలు తమలోతాము ఘర్షణ పడుతూ, తిట్టుకుంటూ కొట్టుకుంటూ చంపుకుంటూ చస్తూ భయపడుతూ తమదారిన తాము ముందుకి కొనసాగుతుంటే- ప్రేక్షకులు అద్భుతమైన అడవిలో తమదారిన విహరిస్తూ వినోదిస్తారు. చిత్రంలో ఏ దృశ్యమూ ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా లేక- ఈ వర్మేనా 'శివ', 'క్షణ క్షణం' చిత్రాల మహాదర్శకుడు- అనిపిస్తుంది. కథలోని పాత్రలన్నీ మనోవిశ్లేషణపరంగా అత్యంత సహజం. కానీ వినత ప్రథమసుతుడు అనూరుడికిలా ప్రతి పాత్రచిత్రణా అపరిపక్వం. ప్రెడేటర్‌ని తలపుకి తెచ్చే అజ్ఞాతజీవి చేసిన హత్యల చిత్రీకరణ- అనుకరణలా అనిపిస్తుందే తప్ప ప్రతిభావంతంగా, సృజనాత్మకంగా తోచదు. హీరో స్నేహితురాలు సమీరతో సహా- ఒక్క చావూ హృదయాలని కదిలించకపోవడం దర్శకుని విఫలతే అనుకోవాలి. చిత్రంలో అడవి మనోహరంగా అనిపించినా- మచ్చుకి ఓ పాము, ఓ కోతి, ఓ కొండచిలువ, ఓ ఏనుగు- మాత్రం కనిపించడం హాస్యాస్పదం. చివరికి హీరో హీరోయిన్లు మాత్రమే మిగలడం కూడా వర్మ స్థాయికి తగనిది. దర్శకుడికంటే కెమేరామన్ ఎక్కువ గుర్తుండిపోయే చిత్రమిది.

**సంభాషణలు:** క్షణక్షణం స్థాయి ఆశించకపోతే ఫరవాలేదు. 'సిక్స్ పాక్ ఉంటే ఆదే నటన అనుకుంటాడు' అన్న డైలాగ్ కథలో హీరో పాత్రని ఉద్దేశించి అన్నప్పటికీ, అది సినిమాకి హీరో అయిన నితిన్ మీద విసురు కాదుకదా అనిపిస్తుంది.

**నటీనటులు:** ఆరంభంలో నితిన్ కొత్తగా, అద్భుతంగా అనిపించాడు. తర్వాత తనదైన శైలిలో తేలిపోయాడు. ప్రియాంక కొఠారి నటన సహజంగా ఉంది. వంపుసొంపుల ప్రదర్శన వర్మ చిత్రాలకి తగినట్లు సహజంగా ఉంది. మిగతావారందరూ తమతమ పాత్రలకి అవధులమేరకి న్యాయం చేసారనిపిస్తుంది.

**పాటలు:** చిత్ర నేపథ్యానికి తగినట్లుగా బాగున్నాయి. చిత్రంతోపాటే మర్చిపోయినా ఆశ్చర్యం లేదు.

**ప్రేక్షకులు:** రెండోవారంలో కూడా తగిన సంఖ్యలో ఉన్నారు. చాలా డైలాగ్స్‌కి స్పందన బాగున్నా రెండోసారి చూడ్డానికి రారనిపించింది.

**ఆశావాదం:** నేపథ్యం 'అడవి' అంత గొప్పగా చిత్రీకరించగలవారు అరుదు. కథనానికి 'క్షణక్షణం', భయానికి 'శివ'ల ఒరవడినిబట్టి- వర్మనుంచి అర్థవంతమైన చిత్రాలని ఆశించవచ్చు.